


జనసేనకు.. పండుగ



నేడే జనసేన ఆవిర్భావ దినోత్సవం

(కాకినాడ/ పిఠాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ జరిగే చిత్రాడ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతోన్న తొలి ఆవిర్భావ సభకు పిఠాపురం మండలం వేదికగా మారడంతో అంతా పండగ వాతావరణం తలపిస్తోంది. శుక్రవారం జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ భారీ ఏర్పాట్లతో సిద్ధమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది తరలి రానున్న సభను జయప్రదం చేయడానికి జనసేన పార్టీ ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ 'జయకేతనం' సభ దద్దరిల్లేలా ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో సన్నాహాలు చేసింది.

అదిరే..ఆతిథ్యం

ఆవిర్భావ సభకు వచ్చే జనసేన నాయకులు, అభిమానులు భోజనాలు, తాగునీరు, స్నాక్స్ కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో విస్తృత ఏర్పాట్లుచేశారు. శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా భోజన సదుపాయాలతోపాటు సభా ప్రాంగణంలో నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, పుచ్చకాయలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ధర్మవరం కోల్డ్‌స్టోరేజీ, యానాం రోడ్డు, అన్నవరం వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ భోజన కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. 20కిపైగా అంబులెన్స్‌లు, ఐదు వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. గురువారం మధ్యాహ్నానికే చిత్రాడకు వందలాదిమంది తరలివచ్చారు. వీరందరికి ఇక్కడే భోజన సదుపాయం కల్పించారు.

డ్రోన్లు..సీసీ కెమెరాలు..

సభను నేరుగా చూసే అవకాశం లేని వారి కోసం సభా ప్రాంగణంలో 20కిపైగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం బయట జాతీయ రహదారిపై ఉండిపోయే వారి కోసం కూడా ప్రత్యేకంగా స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసేందుకు సీసీ కెమేరాలతోపాటు డ్రోన్లతో పోలీసు శాఖ నిఘా ఉంచబోతోంది. సభా ప్రాంగణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 10 నుంచి 15 డ్రోన్లతో సభా ప్రాంగణం, జాతీయ రహదారి, సభకు వచ్చే అన్ని మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. వాటిని నిరంతరాయం గమనించేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. బందోబస్తుకు 1700 మందికి పైగా పోలీసులను ఏలూరు రేంజ్ పరిధిలోని ఆయా స్టేషన్ల నుంచి రప్పించారు. వీరు గురువారం సాయంత్రానికే చిత్రాడ చేరుకున్నారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రహదారుల్లో జనసేన సందడి

వాహన పార్కింగ్ ఇలా..

వాహనాల పార్కింగ్‌కు తొమ్మిది ప్రాంతాలు ఏర్పాటుచేశారు. కాకినాడ వైపు ఐదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు గుర్తించారు. 216వ జాతీయరహదారిపై కాకినాడ-కత్తిపూడి మధ్య ఆవిర్భావ సభకు వచ్చే వాహనాలు తప్ప మిగిలిన వాటి రాకపోకలను ప్రత్యామ్నాయ రహదారులపై మళ్లించారు. ఆర్టీసీ బస్సులు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో తిరిగేవిధంగా ఆయా మార్గాలను సూచించారు.

- ఒక రోజు ముందే పండగ
- చిత్రాడలో సభకు భారీ ఏర్పాట్లు
- లక్షల మంది వస్తారని అంచనా
- ఎకరం విస్తీర్ణంలో సభావేదిక
- 7 గ్యాలరీలు.. 3 మార్గాలు
- తొమ్మిది పార్కింగ్ ప్రదేశాలు
- భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు
- 'థాంక్యూ పిఠాపురం' నినాదం
- మధ్యాహ్నం 3 నుంచి సభ
- ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు
- 1700 మందితో బందోబస్తు

2 గంటల పాటు పవన్ ప్రసంగం

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగా అమరావతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు చిత్రాడ సభా ప్రాంగణం సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగనున్నారు. సభా వేదికకు 500 మీటర్ల దూరంలోనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. పవన్ దాదాపు రెండు గంటలకుపైగా ప్రసంగించే అవకాశం ఉంది. ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఇచ్చిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపేందుకు థాంక్యూ పిఠాపురం చెప్పుకుందాం! అనే నినాదంతో ఈ సభ జరగనున్నది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి పది వరకు జరుగుతాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, ఆడియో, వీడియో ప్రజెంటేషన్లు, ముఖ్య నేతల ప్రసంగాలు, చివరగా పవన్ ప్రసంగం ఉంటాయి.

24 ఎకరాల విస్తీర్ణంలో సభ



చిత్రాడ శివారు 24 ఎకరాల విస్తీర్ణంలో జనసేన ఆవిర్భావ సభ జయకేతనం నిర్వహిస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఏడు గ్యాలరీలు ఏర్పాటుచేసి రెండు మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. అంతకంటే అధికంగా వచ్చేవారు నిల్చుని సభా కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా సభా వేదికను నిర్మించారు. మూడు అంచెల్లో నిర్మించిన సభావేదిక మొదటి వరుసలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఎం పీలు, ఎమ్మెల్యేలు ఆసీనులు కానున్నారు. మి గిలిన రెండు వరుసల్లో సుమారు 250 మంది ఆహ్వానితులు కూర్చునే విధంగా ఏర్పాట్లుచేశారు. సభావేదిక వెనుక భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. సభ చివర స్థానంలో కూర్చున్న వారికి కూడా పసంగాలు వినిపించేలా.. ఏర్పాట్లు చేశారు. అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన లైటింగ్ సిస్టంను వినియోగించారు.

జనసేన జెండాల రెపరెపలు





భారీ ఎల్‌ఈడీ లైట్లతో ముస్తాబైన సభా వేదిక



హెలిప్యాడ్ పరిశీలన

"ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా నా మనసంతా ఇక్కడే ఉంటుంది.. నేను నోటితో చెప్పను.. పనులు చేసుకుంటూ వెళ్తా.. నా కళ్లు, చెవులు మీరే.. ఏ సమస్యనైనా నా దృష్టికి తీసుకురండి.. పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రత్యేకంగా అధికారులను పంపి ఇక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటున్నా" పిఠాపురం నుంచి ఎన్నికైన తరువాత డిప్యూటీ సీఎం పవన్ చెప్పిన మాటలు ఇవి. ఆచరణలో వీటిని సాధించి చూపిస్తున్నారు.

- అభివృద్ధి దిశగా పిఠాపురం
- హామీల అమలులో ముందు
- మోడల్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్ కృషి

నడిపించే.. నాయకుడొచ్చాడు!

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు పిఠాపురం.. నేడు పిఠాపురం వేరు.. పవన్ అన్నొచ్చాడు.. పనులు చేస్తున్నాడు.. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. కోట్లాది రూపాయలతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. 9 నెలల్లోనే ప్రతి అంశంలోనూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనదైన ముద్రను బలంగా వేశారు.దేశంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అందరిచూపూ ఇటువైపు ఉండేలా చూస్తానన్న పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటుచేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. విజన్-2029 ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను ఇప్పటికే శాఖల వారీగా తయారుచేశారు. నాలుగేళ్లపాటు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయిస్తారు. పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.38 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యులకు అదనంగా 23 మంది స్పెషలిస్టు వైద్యులు సహా 69 మంది అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించనున్నారు.

9 నెలలు.. అభివృద్ధి ఇలా..

- సుద్దగడ్డ కాలువపై రూ.4 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రూ.1.35 కోట్లతో పశువుల సంత ఆధునీకీకరణ.
- ఉపాధి హామీ ద్వారా నియోజకవర్గంలో రోడ్ల పనులు చేస్తున్నారు. రూ.6 కోట్లతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. గొల్లప్రోలు, వన్నెపూడిల్లో ఎస్సీ శ్మశాన వాటికల మార్గాలకు ప్రత్యేకంగా భూసేకరణకు నిధులు కేటాయించారు.
- పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధునీకరణకు రూ. 1.75 కోట్లు మంజూరు చేయించారు. 32 ఉన్నత పాఠశాలలకు రూ.16 లక్షలతో 64 క్రీడాకిట్లు అందజేశారు. 33 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.3 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు.
- పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతన రూ.కోటితో నగర వనం ఏర్పాటుకు శ్రీకారం
- పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ.73 లక్షలు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాడవీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరుచేసి పనులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం.
- గొల్లప్రోలులో రూ.44 లక్షలతో తహశీల్దార్ కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభించాల్సి ఉంది.
- పట్టు రైతులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించి.. పరిహారం మంజూరు చేయించారు. గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి రూ.26 లక్షలు కేటాయించారు.
- గొల్లప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.78 లక్షలతో పనులు నిర్వహించారు. ఇవేగాక పలు పనులకు నిధులివ్వడంతో పనులు జరుగుతున్నాయి.



సుద్దగడ్డ వాగుపై వంతెన వస్తోంది..



పల్లెలు.. పట్టణాలకు రోడ్లు పడ్డాయ్..



100 పడకల ఆసుపత్రి వచ్చేసింది..

17 నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లపై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో ఆమె గురువారం సమీక్షించారు. ఈ నెల 17 నుంచి ఆరంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 25,723 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 134 కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని చెప్పారు. 1100 మంది ఇన్విజిలేటర్లు, 10 స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్తు సరఫరా, అత్యవసర మందులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 22 పోలీస్ స్టేషన్లలో ప్రశ్న, జవాబు పత్రాలను భద్రపరచామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాకు సెట్-1, సెట్-2 ప్రశ్న పత్రాలు చేరుకున్నాయన్నారు. కడియపులంక,పోతవరం, రాజుపాలెం, ధవళేశ్వరం జడ్పీ, కొవ్వూరు ప్రభుత్వ, భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్స్‌ని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అదనపు భద్రత ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల పునర్వవస్థీకరణలో భాగంగా 570 పాఠశాలలు గుర్తించామన్నారు. వీటిలో 504 అంగీకరించగా, అభ్యంతరాలపై నివేదిక అందజేయాలని ఇంకా అంగీకరించని 66 పాఠశాలలను ఆదేశించామన్నారు. బడి బయట 22వేల మంది పిల్లలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయని..వారిలో 19 వేల మంది విద్యార్థుల వివరాలను సేకరించామన్నారు. వేరొక స్కూల్‌లో చేరడం, బదిలీపై వెళ్లడం తదితర కారణాల వల్ల డ్రాపవుట్‌లో నమోదు కావడం జరిగినట్టు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.



అక్రమ ఇసుకను సీజ్ చేసిన ఏడీ ఫణిభూషణ్ రెడ్డి తదితరులు

1100 టన్నుల అక్రమ ఇసుక సీజ్

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.. దోపిడీ సాగిపోతూనే ఉంది. కాతేరు ర్యాంపులలో అక్రమంగా నిల్వ ఉంచిన 1100 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్టు మైన్స్ ఏడీ డీ. ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ర్యాంపుల్లో తనిఖీ చేయగా సుబ్బారావు సొసైటీ,రమేష్ బోట్స్‌మన్ సొసైటీల ఆధ్వర్యంలో నిల్వ చేసిన ఇసుక సీజ్ చేశామన్నారు.అక్కడ రెండు యంత్రాలు ఉన్నట్టు గుర్తించామన్నారు.ఇసుకఅక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

మహిళలు,బాలికల రక్షణకు శక్తి యాప్

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల రక్షణలో 'శక్తి' యాప్ ఎంతో శక్తివంతమైనదని.. వారి సెల్‌ఫోన్‌లో తప్పనిసరిగా ఆ యాప్ ఉండాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. యాప్ డౌన్‌లోడ్, ఇన్‌స్టలేషన్, ఫీచర్లపై సాంకేతిక బృందంతో గురువారం ఎస్పీ సమీక్షించారు.గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా ఆపద సమయంలో తక్షణ పోలీసు సహాయం అందుతుందని చెప్పారు. ఇప్పటికే చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఆపదలో ఉన్న సమయంలో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే తక్షణమే వారు ఉన్న ప్రదేశం వివరాలు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి, డయల్ 112 కాల్ సెంటర్‌కి చేరడం పోలీసులు వెంటనే అక్కడి చేరుకొని వారిని రక్షించడం జరుగుతుందన్నారు. మండలాల వారీగా పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలు, బాలికల రక్షణకు నైట్ షెల్టర్లు, వన్‌స్టాప్, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలోనే శక్తి టీమ్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) మురళీ కృష్ణ, డీఎస్పీ భవ్య కిశోర్ పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ఎన్టీఆర్ నగర్ ఇళ్ల నిర్మాణంలో కదలిక

27,441 మంది గుర్తింపు

రేపటి నుంచి అవగాహన

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడానికి కూటమి నిర్ణయించింది. పేదల ఇళ్ల నిర్మించుకునే కాలనీలకు ఎన్టీఆర్ కాలనీలు అని పేరుకూడా ఖరారు చేసినసంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 27,441 మంది లబ్ధిదారులను గుర్తించామని వారికి పీఎంఏవై గ్రామీణ, అర్బన్ 1.0 పథకం కిందే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నిధులు ఇవ్వను న్నట్టు చెప్పారు. ఎస్సీ బీసీలకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75వేలు, పీజీటీ గ్రూపు లకు రూ.లక్ష వంతున ఆర్థిక సహాయం చేస్తున్నట్టు చెప్పారు. నాలుగు దశల్లో లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు పడతాయన్నారు.ఈ మేరకు లబ్ధిదారులకు శనివారం నుంచి అవగాహన కల్పించాలని చెప్పారు. మే నెల 31వ తేదీలోపు జిల్లాలో 7 వేల ఇళ్ల నిర్మాణం చేయాలని తెలిపారు. డిసెంబర్ లోపు మొత్తం పూర్తి చేయాలన్నారు. వెలుగుబంద ఎన్టీఆర్ నగర్‌లో 1240 ఇళ్లను మే 31లోపు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, డ్వామా పీడీఎ.నాగమల్లేశ్వర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బీవీ. గిరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కీడు బట్టలు ధరించడానికి వెళుతూ

బామ్మ..మనవడు మృతి

ప్రమాదం ఏ వైపు నుంచి ఎలా వస్తుందో ఊహించడం కష్టమే.. దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద గురువారం జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ.. బామ్మ మనవడు కీడు బట్టలు ధరించడానికి బైక్‌పై బయలుదేరారు.. అయితే దుద్దుకూరు వద్ద లారీ వెనుక వేగంగా వెళుతుండగా లారీకి సడన్ బ్రేక్ వేశాడు.. వెనుక వస్తున్న బైక్ లారీని ఢీకొట్టడంతో బామ్మ మనవడు మృతిచెందారు. - 6లో

శూలాలు గుచ్చుకుని.. పండుగ!

అంతా ఉత్తిదే అనుకుంటే పొరబడినట్టే..అక్కడ నోటిలో ఒక వైపు నుంచి మరొక వైపునకు వచ్చేలా శూలాలతో గుచ్చుకుంటారు..వాటికి అటూ ఇటూ నిమ్మకాయలు పెడతారు.. నడుం మీద కొక్కెంలతో గుచ్చుకుని రథాన్ని లాగుతారు.. ఆ ఒక్క రోజు అత్యంత నిష్ఠగా ఉంటారు.. ఇదెక్కడో మారుమూల అనుకునేరు.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ప్రతి ఏడాది మార్చి 13న ఒక కాలనీలో భక్తులు చేసే శూలాల పండుగ ఇది.. గురువారం జరిగింది. చాలా ఏళ్ల కిందట తమిళనాడు వాసులు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు.. బర్మాకాలనీ అని ఒక పేరుపెట్టుకున్నారు.. ఆ కాలనీలో అంతా వారే. ప్రతి ఏడాది మార్చి 13న శూలాల పండుగ చేస్తారు. గురువారం ఇలా శూలాలు గుచ్చుకుని.. నడుంకి కొక్కెంలు పెట్టుకుని పుష్కరఘాట్ నుంచి బర్మాకాలనీ వరకూ రథాన్ని సుమారు 5 కిలో మీటర్లు లాగుతూ ర్యాలీ చేశారు. వారి వెనుక మహిళలు పాల బిందెలతో నడిచారు. - వివరాలు 7లో



ఇలా గుచ్చుకుని..

ఇలా లాగుతూ..

వీపుపై ఇలా..

6 వైభవంగా రంగనాథ కల్యాణం

ఆవిర్భావ సభకు పటిష్ట బందోబస్తు



జనసేన ఆవిర్భావ సభ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ ఆవిర్భావ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో శుక్రవారం జరిగే ఆవిర్భావసభవద్ద భద్రతా ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్ తదితరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.సభా ప్రాంగణంతోపాటు సభకు వచ్చే మార్గాల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలను నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆవిర్భావ సభ బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి పోలీసు అధికారులు, పోలీసులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీలు భాస్కరరావు, సత్యనారాయణ, కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఉన్నారు.

ప్రజాసేవకు పునరంకితం అవుతాం

» పిఠాపురం ప్రజలకు నిండు మనస్సుతో కృతజ్ఞతలు
» ఆవిర్భావ సభకు మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నాం
» రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్



పిఠాపురం మండలం చిత్రాడ ఆవిర్భావ సభ వేదిక జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎంపీ ఉదయశ్రీనివాస్ తదితరులు

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ ద్వారా ప్రజాసేవకు పునరంకితం కావడంతోపాటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను నిండు మనసుతో ఆశీర్వదించిన పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడజిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో జరిగే జనసేన ఆవిర్భావ సభ వేదికవద్ద గురువారం రాత్రి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దేశచరిత్రలోనే తొలిసారిగా..

11ఏళ్లపాటునిస్వార్థమైన పవన్‌కల్యాణ్ రాజకీయ ప్రస్థానంతో ఈ రోజున అధికారంలోకి భాగస్వాములుగా ఉన్నామని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దేశచరిత్రలోనే తొలిసారిగా పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలన్నింటిలో విజయం సాధించి చరిత్ర సృష్టించామన్నారు. ఈ విజయం ప్రజల కోసమని, వారు ఏ విధంగా తమపై నమ్మకంతో గెలిపించారో దాన్ని నిలబెట్టుకుంటూ ఈ సభ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా కృషిచేస్తామని చెప్పారు. జనసేన పోరాటంలో పవన్‌కల్యాణ్‌తో నిలబడిన జనసైనికులు, వీర మహిళలను ఆవిర్భావ సభలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం చేసేందుకు 14 కమిటీలు ఏర్పాటు చేసి 450 మందిని సభ్యులుగా నియమించామని చెప్పారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంనుంచే ఆహ్వాన కమిటీలో 250మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. సభకు వచ్చిన ప్రతిఒక్కరినీ అతిథులుగా ఆదరించి గౌరవిస్తామని, వారు తిరిగి వెళ్లే సమయంలో నాలుగు ప్రధాన రహదారులపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జనసేన పార్టీని ఒక నమ్మకంతో ప్రజలు గెలిపించారని, తమ జీవితాల్లో మార్పులు వస్తాయని వారు భావించారని మంత్రి తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా అభివృద్ధి చేసి చూపించడంతోపాటు సంక్షేమాన్ని ప్రతి కుటుంబానికి చేరుస్తామని చెప్పారు.

మధ్యాహ్నమే సభ ప్రారంభం

జనసేన పార్టీ ఆవిర్భావ సభ కార్యక్రమాలు మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభమవుతాయని మంత్రి నాదెండ్ల తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా ఒక మత్స్యకార ప్రతినిధి, పవన్‌కల్యాణ్ పర్యటించిన ఏజెన్సీ గ్రామాల ప్రతినిధిలో రోడ్ల నిర్మాణంతో వారి జీవితాల్లో వచ్చిన మార్పులు, యువత ద్వారా జనసేన నుంచి ఏం ఆశిస్తున్నారు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి తదితర అంశాలపై అభిప్రాయాలతో ప్రసంగాలు ఉంటాయని వివరించారు.

అభివృద్ధి గురించి వివరిస్తాం

పిఠాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజంటేషన్, కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం కేంద్రంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని పవన్ చెప్పిన దానికి అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తామన్నారు. రాజకీయ నాయకుల ప్రసంగాలతోపాటు చివరిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రసంగం ఉంటుందని చెప్పారు. పలు ఆడియో, వీడియో ప్రజంటేషన్లు ఉంటాయని చెప్పారు. సభా ప్రవేశమార్గాలకు డొక్కా సీతమ్మ, సత్యలింగనాయకర్, పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్‌ల పేర్లను పెట్టినట్లు తెలిపారు. రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా సమాజం,రాష్ట్రం, దేశంకోసం పునరంకితమయ్యే దిశగా సభ ఉంటుందని చెప్పారు. తమకు గతంలో జరిగిన అవమానాలు, ఇబ్బందుల గురించి కాకుండా ప్రజలకోసం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసమే ఆలోచిస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు.. కాకినాడ జిల్లాలో

పవన్ పర్యటన

» జనసేన ఆవిర్భావ సభలో పాల్గొననున్న డిప్యూటీ సీఎం



చిత్రాడవద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్ర, శనివారాల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 14వతేదీ ఉదయం 9.35గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని నివాసంనుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి 10గంటలకుబయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు 10.40గంటలకు చేరుకుని, అక్కడినుంచి మంగళగిరి క్యాంప్ ఆఫీసుకు వెళ్తారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం హెలీపాడ్‌నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరి చిత్రాడవద్ద జరిగే జనసేన ఆవిర్భావసభలోని హెలిపాడ్‌వద్దకు 3.45 గంటలకు చేరుకుంటారు. రాత్రి 7.30గంటల వరకూ ఆవిర్భావ సభలో పాల్గొని చిత్రాడనుంచి బయలుదేరి కాకినాడ జేఎన్‌టీయూ అతిథిగృహానికి చేరుకుని అక్కడ రాత్రిబసచేస్తారు. 15వతేదీ ఉదయం 9.15 గంటలకు అతిథిగృహంనుంచి బయలుదేరి కాకినాడ పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌నుంచి హెలికాప్టర్‌లో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో జనసేనలోకి చేరికలు



పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

గొల్లప్రోలురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో గురువారం రాత్రి పలువురు వైసీపీ నేతలు జనసేనలో చేరారు. పిఠాపురం మునిసిపల్ కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు), దుర్గాడ న్యాయవాది ఇంటి సర్వారాయుడు(బాబు) సహా 31మంది జనసేనలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావసభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథ కల్యాణం

కోరుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం రంగనాథ స్వామి ఆలయం వద్ద శ్రీ భూ సమేత రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక అర్చకులు పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగుఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు మంత్రోచ్చారణల మధ్య వంశ పారంపర్య కల్యాణ దాత గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులు ఎస్‌టీపీ వెంకటరమణాచార్య స్వామి దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు పాలకొల్లు నుంచి వచ్చిన భక్తులు, వెంకటరమణాచార్య శిష్యులు.. బాదంపాలు, ప్రసాదాలు అందజేశారు. కల్యాణాన్ని జరిపించిన ఆగమ బ్రహ్మలను అనువంశిక ధర్మకర్తలు, శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, రఘునాథ భట్టర్‌లను, అర్చకులను, ఆలయ అధికారులను కల్యాణకర్త దంపతులు సత్కరించారు. పదేళ్లగా ఈ కల్యాణం నిర్వహిస్తున్న వెంకటరమణాచార్య దంపతులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గజవాహనంపై నరసన్న గ్రామోత్సవం

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీనరసింహస్వామికి గజవాహనంపై గ్రామోత్సవం చేశారు. దిగువ దేవస్థానం వద్ద సేవాకాలం నిర్వహించి స్వామి వారిని ఆలయ అర్చకులు గజవాహనంపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు ఫల పుష్పాలు, మంగళ నీరాజనాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషమాల, శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న విశిష్టాద్వైత పండిత సభల్లో రామనుజ ముని జీయర్ స్వామి, ఉభయ వేదాంత పండితులు గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్య స్వామి(భద్రాచలం స్థానాచార్యులు), పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, స్థలసాయి ఉపన్యసించారు. కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో ఉదయం, సాయంత్రం అన్నప్రసాదాలు అందజేస్తున్నట్టు సత్రం ఈవో గండి వెంకటలక్ష్మీకుమార్, వి.సూరిబాబు తెలిపారు.



గజవాహనంపై నిర్వహిస్తున్న నరసన్న గ్రామోత్సవం

కాకినాడ జిల్లా పోలీసులకు సీసీ కెమెరాల వితరణ



ఎస్పీ బిందుమాధవ్‌కు సీసీ కెమెరాలు అందిస్తున్న మురళి

కాకినాడ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి పోలీసు శాఖకు రూ.1.20 లక్షలు విలువైన సీసీ కెమెరాలను అందించారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు సీసీ కెమెరాలు పోలీసు శాఖకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు చొరవతో సీసీ కెమెరాలు అందించిన పారిశ్రామికవేత్త మురళిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ఈడీ ఎన్.శిశిర్, హెచ్ఆర్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు 9850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజీ నుంచి మూడు డెల్టా కాలువలకు 9850క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2950క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1900 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5వేల క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,235క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా, పాండ్ లెవెల్‌గా 13.75మీటర్లుగా నమోదైంది.

వెంకన్న ఆలయంలో ఎమ్మెల్సీ 'సోము' పూజలు



వెంకన్న ఆలయంలో సోము దంపతులు

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. సోము దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలిలో ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన అరుగుల చంద్రరావు(63) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే ఓశుభ కార్యక్రమానికి నడుచుకుంటూవెళ్తున్నాడు. ర్యాలి జిమ్‌సెంటర్‌వద్దకు వచ్చేసరికి క్రిషి ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తవల్ల బలంగా ఢీకొనడంతో చంద్రరావు అక్కడిక్కడే మృతిచెందాడు. దీనిపై మనుమడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఏఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్

» ఒకే కుటుంబంలోని మామ్మ, మనవడు దుర్మరణం
» తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఘటన
» గోపాలపురం గ్రామంలో విషాదఛాయలు







మీరాతున్నీస, సమీర్(పాత చిత్రాలు).. దేవరపల్లి మండలం దుద్దుకూరు సమీపంలో సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) భర్తకు గుండె ఆపరేషన్ చేయించి నెల కాకుండానే భార్య, మనవడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన మామ్మ షేక్ మీరాతున్నీస (50), మనవడు షేక్ సమీర్(17) కీడుబట్టలు కట్టుకోవడానికి గురువారం కొవ్వూరు మండలం పంగిడి సమీపంలోని గోవర్ధనమెట్ట వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి బయల్దేరారు. 1.30గంటల సమయంలో దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఎదురుగా వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక మోటారు సైకిల్‌పై వస్తున్న వీరు లారీని ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మీరాతున్నీస చికిత్స పొందుతూ మృతిచెందింది. సమీర్‌ను మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మీరా తున్నీస కుమారుడు షేక్ రియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు సమీర్(17) స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయసంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. తండ్రి రియాజ్ వడ్రంగి పనిచేస్తుంటాడు. ఆయనకు చేదోడుగా ఉంటూ ఖాళీ సమయాలు, సెలవు రోజుల్లో తండ్రితో కలిసి వెళ్తూ పనిలో సాయం చేస్తుంటాడు. గురువారం పరీక్ష లేకపోవడంతో నానమ్మను ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. సమీర్ స్నేహితులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

కారు ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి



వీరేంద్ర (పాత చిత్రం)

ఐ.పోలవరం/ముమ్మిడివరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కొమరగిరి వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని ముమ్మిడివరానికి చెందిన వంటపాటి వీరేంద్ర (32) మృతి చెందాడు. యానాం నుంచి మోటారు సైకిలుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు మట్టాడిపాలేనికి చెందిన వంటపాటి రాముడు-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్దవాడైన వీరేంద్రకు భార్య నాగవెంకటదుర్గ, ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీదివ్యలక్ష్మి, ఆరవ తరగతి చదువుతున్న దివ్యశ్రీ ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. వీరేంద్ర లారీపై జట్టు కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరేంద్ర మృతితో ఆ కుటుంబం ఆదరణ కోల్పోయింది.



హీరో శ్రీకాంత్‌ను ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకస్వామి

అంతర్వేది నరసన్న సన్నిధిలో సినీ హీరో శ్రీకాంత్

అంతర్వేది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హీరో శ్రీకాంత్ గురువారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.ప్రదక్షిణ తర్వాత అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించి వేదపండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. అర్చకులు ఆయనకు స్వామిచిత్రపటం,ప్రసాదం అందజేశారు.

ఉత్తమ ప్రదర్శనగా 'కనకపుష్యరాగం'

గొల్లప్రోలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక ప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. విజయవాడ దృశ్య వేదిక కళాకారుల 'కనకపుష్యరాగం' నాటకం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారుల 'ఇది అతని సంతకం', తృతీయ ప్రదర్శనగా కాకినాడ కార్తికేయ క్రియేషన్స్ కళాకారుల 'ఎడారిలో వాన చినుకు' ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎస్‌కే మిశ్రో (కనకపుష్యరాగం), రచనగా వల్లూరి శివప్రసాద్ (అన్నదాత), ఉత్తమ నటుడిగా దొంతల ప్రకాష్ (కనకపుష్యరాగం), నటిగా జ్యోతి (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ ప్రతి నాయకుడిగా కొల్లా రాధాకృష్ణ (అన్నదాత), హాస్య నటుడిగా ఈవన రమేష్‌బాబు (కనకపుష్యరాగం), సహాయ నటుడిగా బి.గణేష్ (ఎడారిలో వాన చినుకు), సహాయ నటిగా జి.నాగకుసుమసాయి (ఇది అతని సంతకం), ఉత్తమ క్యారెక్టర్ నటిగా శోభారాణి (అన్నదాత), క్యారెక్టర్ నటుడిగా రాధాకృష్ణ (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ సంగీతం-లీలామోహన్ (ఇది అతని సంగీతం), ఆహార్యం-నాగు (ఎడారిలో వానచినుకు), ఉత్తమ రంగాలంకరణ-శివధామ్ (ఇది అతని సంతకం), జ్యూరీ అవార్డులకు పుష్యమి, కేబీ ఆనంద్ (భౌ..భౌ..భౌ) ఎంపికయ్యారు. విజేతలకు అపర్ణా నాటక కళా పరిషత్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ప్రతి మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా రాష్ట్ర స్థాయిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ప్రతి నెలా మూడో శనివారం స్ఫూర్తిదాయకంగా నిలిచేలా స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. క్షేత్ర స్థాయి అధికారులతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహణపై గురువారం సాయంత్రం దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ మెరుగైన పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత గ్రామ సభలు, ప్రజల్లో అవగాహన చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టడం, గృహ సోక్ పిట్స్, కంపోస్ పిట్‌ల నిర్మాణాం, వాటి నిర్వహణ పర్యవేక్షణ నివేదికలు ఎప్పటికపుడు అప్‌లోడ్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో నీటిమాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సమన్వయకర్తగా పర్యవేక్షణ బాధ్యత వహిస్తారన్నారు. వ్యర్థాల విభజన, కంపోస్టింగ్ నిర్వహణలో గృహ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవడం ద్వారా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో ఎంపీడీవోలు కీలక బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వారసత్వ రాజకీయాలను చంద్రబాబు ప్రోత్సహించరు : పెందుర్తి

కోరుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వారసత్వ రాజకీయాలను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రోత్సహించరని మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ అన్నారు. కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారిని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెందుర్తిని విలేకరులు.. నియోజకవర్గంలో పెందుర్తి అభిరామ్‌కు ఏమైనా కీలక బాధ్యతలు అప్పగిస్తారా ప్రశ్నించగా వారసత్వ రాజకీయాలను చంద్రబాబు ప్రోత్సహించరని, ఎవరికి వారే తమ ప్రతిభా పాటవాలతో నాయకుడిగా ఎదగాలని, ప్రజల్లోంచి రావాలని అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితిపై ప్రశ్నించగా ఇక్కడ ముగ్గురు ఎమ్మెల్యేలున్నారని అందరూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకత్వంలో బాగా పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ టీడీపీ క్యాడర్‌ను బాగానే చూసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే బత్తులతో మాట్లాడి టీటీడీ, అన్నవరం దేవస్థానం నుంచి నిధులు తీసుకువచ్చి నరసింహస్వామి దేవస్థానం మరింత అభివృద్ధికి ప్రయత్నం చేస్తానన్నారు. కాగా సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా, కేబినేట్ మంత్రి హోదాలో నియమితులైన తరువాత మొదటిసారిగా కోరుకొండకు వచ్చిన సందర్భంలో కాపవరం సెంటర్‌లో ఆయనకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. బాణసంచా కాల్చారు. ఆయన వెంట తనయుడు పెందుర్తి అభిరామ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విప్లవ యోధుడు 'మోతా' : ముప్పాళ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అనేక ప్రజా ఉద్యమ నిర్మాణాల్లో పోరాట పటిమతో విప్లవ యోధుడిగా నిలిచిన మోతా వెంకట్రావు చివరి శ్వాస వరకు ఎర్రజెండాను వీడలేదని ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల సంఘం నేత ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. కామ్రేడ్ మోతా వెంకట్రావు 6వ వర్ధంతి సభ గురువారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవన్‌లో ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మౌనం పాటించి వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముప్పాళ్ల మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం విముక్తి పోరాటాల్లో వెంకట్రావు క్రియాశీలకంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, కొండా దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, స్త్రీవిముక్తి జిల్లా కన్వీనర్ సంగీత, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకురాలు సాకా సూర్యకళ, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కన్వీనర్ సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ శ్రీదేవికి డాక్టరేట్

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న మేడిశెట్టి శ్రీదేవికి ఆంధ్ర విశ్వవిద్యాలయం బోటనీ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. పర్యావరణ వ్యవస్థలోని ఉప్పు నీటి మొక్కల్లో అంతర్గత కణజాలాల్లో నివసిస్తున్న మొక్కలకు ఉపయోగపడుతున్న బాక్టీరియాలను, వాటి లక్షణాలను, పరిశోధన ద్వారా తెలుసుకుని, వాటి స్థిరమైన పంట ఉత్పత్తిని ప్రోత్సహించడానికి వ్యవసాయ ఆవర్తనలకు ఉపయోగపడే సంభావ్య జీవ ఉపయోగకర బాక్టీరియ జాతులను గుర్తించి పరిశోధన చేసినందుకు శ్రీదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్టు ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ డి.సంధ్యదీపిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవిని ప్రిన్సిపాల్ రాఘవకుమారి, వైస్ ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి,సునీత తదితరులు సత్కరించారు.

కవయిత్రి మొల్ల జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించిన మొల్ల అభినందనీయురాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. గురువారం ప్రముఖ రచయిత, కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ.. మొల్ల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొల్ల రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ఎంతో ప్రాచుర్యం పొందిందని, నాటి పద్ధతికి భిన్నంగా వాడుకభాషకు దగ్గరగా తెలుగులో రాసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి బి.శశాంక, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు, కలెక్టరేట్, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. గోదావరి తీరం గౌతమి ఘాట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి శశాంక.. మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏబీసీడబ్ల్యువోలు ముత్యాల సుబ్బారావు, పి.రామకృష్ణ, రాష్ట్రశాలివాహన సంఘం అధ్యక్షుడు డి.వేమన, హెచ్‌డబ్ల్యువోలు పాల్గొన్నారు.



మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు

కాశినాయన ఆశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలి

కేంద్ర మంత్రికి ఎంపీ పురందేశ్వరి వినతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నల్లమల అడవిలోని కాశినాయన ఆశ్రమ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కోరింది. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఒక వినతిపత్రం అందజేస్తూ నంద్యాల జిల్లా నల్లమల అడవిలోని జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమాన్ని పరిరక్షించాలని కోరారు. కాశినాయన ఆధ్యాత్మిక బోధనలు, అన్నదాన క్షేత్రాల ఏర్పాటుకు ప్రేరేపించాయని తెలిపారు. అయితే, జాతీయ వన్యప్రాణి మండలి ప్రతికూల సిఫార్సుల ఆధారంగా జ్యోతిక్షేత్రంలో ఉన్న ఆశ్రమాన్ని అటవీశాఖ బుల్డోజ్ చేయాలని తీసుకున్న నిర్ణయం భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించిందని తెలిపారు. కేంద్ర ఈ ఆశ్రమాన్ని పరిక్షించాలని కోరినట్టు పేర్కొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ తనిఖీలో డిప్యూటీ కమిషనర్ చైతన్యమురళి



రంగంపేటలో రికార్డులు తనిఖీ చేస్తున్న చైతన్య మురళీ

రంగంపేట,మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామాన్ని సారా రహితంగా తీర్చిదిద్దాలని, రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ నవోదయం 2.0 అమలు చేసి సారాను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి అన్నారు. రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకొని జీరో క్రైమ్ రేటు ఉండే విధంగా చూడాలన్నారు. స్టేషన్ సీఐ, సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఐ డి.సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రూ. 2లక్షల విలువైన బ్యాటరీలు కాపర్ వైర్లు స్వాధీనం, కారు సీజ్

అనపర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయాలను టార్గెట్‌గా చేసుకుని బ్యాటరీలు, కాపర్ వైర్లను చోరీ చేస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గురువారం ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. దుప్పలపూడి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఓ కారులో దొంగిలించిన సొత్తు బయటపడిందన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన కొల్లిపర రూపా శేషుబాబు, పతి అమర్నాథ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ2 లక్షల విలువైన 8 బ్యాటరీలు, 85 మీటర్ల కాపర్ వైరును స్వాధీనం చేసుకుని దొంగతనాలకు వినియోగించిన కారును సీజ్ చేశామన్నారు. వీరు ముమ్మిడివరం, యానాం, తిమ్మాపురం, రామచంద్రపురం, ప్రకాష్ నగర్, అనపర్తిల్లో దొంగతనాలు చేసినట్టు అంగీకరించారని ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

ఘనంగా శూలాల పండుగ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా శూలాల పండుగ ఘనంగా జరిగింది. స్థానిక 9వ డివిజన్‌లో బర్మాకాలనీలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్నారు. క్రోధినామ సంవత్సర పాల్గుణ మాసం పంచమినాడు ఉత్సవాలు ఆరంభించారు.కాగా 50 ఏళల క్రితం బర్మా నుంచి రాజమహేంద్రవరం పనుల నిమిత్తం వచ్చిన ఆ దేశస్థులు ఇక్కడ జాతీయ రహదారిని ఆనుకుని సుబ్రహ్మణేశ్వర ఆలయాన్ని నిర్మించి ఆ దేశం మాదిరిగా ఉత్సవాలు ప్రారంభించారు. ఇప్పటికి 46 ఏళ్లపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతియేట స్వామి వారు భక్తులు కోర్కెలు తీర్చేందుకు కుజ, రాహు, కేతు, సర్ప, కాలసర్ప దోష నివారణ కారకుండైన షణ్ముఖునికి ప్రతీ బర్మా కాందిశీకులు, సిలోన్ కాందిశీకులు జన్మ కావిడ్లు, పన్నీరు కావిడి, చందన కావిడి ,వేల్ కావిడి, పుష్పకావిడి,లు సమర్పించి ఒంటినిండ శూలాలు గుచ్చుకుని వీపై పదునైన హుక్కులు గుచ్చుకుని రథానికి కట్టి లాగి మొక్కులను తీర్చుకుంటారు. ప్రతియేట ఈ పండుగను నిర్వహిస్తున్నారు.

ఈనెల 11 వరకు ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం బర్మాకాలనీ నుంచి పుష్కరాల రేవు వరకు రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ మాలధారులు శూలాలను ఒంటికి గుచ్చుకుని రథాన్ని లాగారు. మహిళలు పసుపుబట్టలు ధరించి పాలబిందెలతో పుష్కరాలరేవుకు చేరుకున్నారు. కలశస్థాపన చేశారు. అక్కడ నుంచి తిరిగి రథాన్ని బర్మా కాలనీలోని స్వామి ఆలయానికి తీసుకుని వెళ్లారు.



శూలాల పండుగలో వివిధ రకాల దేవుని మందిరాలతో సుబ్రహ్మణేశ్వరస్వామి మాలధారులు

రేపటి నుంచి శ్రీషిర్డిసాయి వార్షికోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణం వద్ద శ్రీ షిర్డి సాయి మందిర వార్షికోత్సవాలు ఈ నెల 15,16,17 తేదీల్లో జరుగుతాయని నిర్వాహకుడు ఏవీబీ శ్రీరామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి రోజు విశేష కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యాన్ని సహించం

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్
- అనపర్తి మండలంలో పర్యటన



ఎల్ఎన్ పురం హాస్టల్ విద్యార్థులతో భోజనం చేస్తున్న కిరణ్

అనపర్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను, రేషన్ షాపులను, ఉన్నత పాఠశాలను, ఏరియా ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశా రు. ముందుగా అనపర్తిలోని గాంధీనగర్, సునందపేట, ఇందిరానగర్, షారోన్‌పురం, టీటీడీ కళ్యాణ మండపం ఏరియాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులు నిర్వహించకపోవడం, సెంటర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడీపీవో, సూపర్‌వైజర్లకు మెమో ఇవ్వాలని పీడీ కె.విజయకుమారిని ఆదేశించారు. అనంతరం గాంధీనగర్‌లోని రేషన్ షాపును తనిఖీ చేశారు. అలాగే బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. రోగుల కోసం బయట నుంచి తీసుకువచ్చిన భోజనాన్ని రుచి చూసి భోజనం మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డిని సూచించారు. అనంతరం లక్ష్మీనరసాపురంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయకుమారి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రాధిక, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి కేఎన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 679 మంది హాజరు

ప్రశాంతంగా ముగిసిన మొదటి సంవత్సరం పరీక్షలు

రంగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ-1, కామర్స్-1 పరీక్షలకు 679 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. 'ఎ', 'బి' సెంటర్లలో మొత్తం 715 మందికి గాను 36 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు. పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు సీఎస్‌లు పేర్కొన్నారు.

రాధారాణికి తాడోజు కిరణ్ స్మారక పురస్కారం



రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ చిత్రకారుడు తాడోజు కిరణ్ స్మారక చిత్రకళా పురస్కారం కోసం ప్రఖ్యాత చిత్రకారిణి పట్నాల రాధారాణిని ఎంపిక చేసినట్టు తాడోజు కిరణ్ చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి కోదూరి చండీప్రియ గురువారం ప్రకటించారు. ఈ నెల 16న దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీలో జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఈ పురస్కారాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. కాగా లాలాచెరువు నివాసిస్తున రాధారాణి తన ఏడో ఏట నుంచే చిత్రకళపై మక్కువ పెంచుకున్నారు. 1971లో లలిత కళా అకాడమీ అవార్డు, 2016లో మన సంస్కృతి అవార్డు,2018లో భాషా సాంస్కృతిక అవార్డు అందుకున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

పరిశ్రమల కేంద్రం జిల్లా జనరల్ మేనేజర్ శ్రీవాణి ధర రామన్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రామన్

రాజానగరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీవాణి ధర రామన్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, విశాఖపట్నంలోని ఎమ్మెస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వ్యవస్థాపక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రోచాన్సలర్ కె.విజయభాస్కర్‌రాజు అధ్య క్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు జీఎం రామన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలు స్థాపించి, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకోవాలన్నారు. పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విధాన కార్యక్రమాలను రూపొందించిందన్నారు. విశాఖలోని భారత ప్రభుత్వ ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏఐసీటీఈ కోర్సుల ప్రిన్సిపాల్, కీలక రిసోర్స్‌పర్సన్ ఆచార్య కె.మురళీకృష్ణ మాట్లాడుతూ భావి పారిశ్రామికవేత్తల కోసం ప్రపంచ స్థాయి వనరులను విశాఖపట్నంలో దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. యువత శిక్షణ పొందడంతో పాటు ప్రాజెక్టులు కొలాబరేషన్స్ వంటివి వీటి ద్వారా చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జీజీయూ ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ ఎస్ఎన్ మూర్తి, ఎంబీఏ విభాగాధిపతి బీవీఆర్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న 'నన్నయ'లో అంతర్జాతీయ సెమినార్

యూనివర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ.. బ్రోచర్ ఆవిష్కరణ



సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రసాయనశాస్త్రవిభాగం ఆధ్వర్యంలో ఈ నెల 17న అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించి వివరాలు తెలిపారు. కంట్రోల్ ఆఫ్ నిట్రోసామినేష్ ఇన్ ఫార్మాస్యూటికల్స్ అండ్ అనలిటికల్ టెస్టింగ్ అనే అంశంపై ఈ సెమినార్‌జరుగుతుందన్నారు. ఈ సదస్సులో వక్తలుగా అమెరికాలోని సైజన్ ఫార్మా స్యూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డా.విష్ణుమారిశెట్టి, కెమ్ టెక్స్ లేబరొటరీస్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కటారి, మలేషియా ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి చెందిన వి.రవి, ఆంధ్ర యూనివర్శిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ అమరేందర్‌రెడ్డి విచ్చేసి ఉపన్యసిస్తారని చెప్పారు. సెమినార్ ప్రధానఅంశంపై పరిశోధకులు, అధ్యాపకులు పరిశోధన పత్రాలు సమర్పించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, రసాయనశాస్త్రం విభాగ అధిపతి కె.దీప్తి, అధ్యాపకులు ఎస్.రామకృష్ణ, సి.హెచ్.మురళీకృష్ణ, సి.హెచ్.వెంకటపద్మారావు, పి.ఎస్.ఆర్.విద్యాసాగర్ పాల్గొన్నారు.

డిప్యూటీ రిజిస్ట్రార్ లింగారెడ్డికి పీహెచ్‌డీ

నన్నయ వర్శిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డికి వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. లింగారెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన జిల్లాలో ఉన్నతవిద్యలో మానవ వనరుల విశ్లేషణ- ఉపాధ్యాయుల పని తీరు అనే అంశంపై పరిశోధన చేశారన్నారు. వీరికి గైడ్‌గా నన్నయ వర్శిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం డీన్ ఎన్.ఉదయభాస్కర్, కోగైడ్‌గా సీతానగరం ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు వ్యవహరించారన్నారు. ఈ సందర్భంగా లింగారెడ్డిని వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా సాంఘిక సంక్షేమాధికారి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. జిల్లాలో శిక్షణా కార్యక్రమం అందజేసేందుకు స్వయం కృషి గురుకృపా ఎడ్యుకేషన్ సొసైటీని ఎంపిక చేసినట్టు ఆమ పేర్కొన్నారు. కాగా, అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సాంఘిక సంక్షేమశాఖ అధికారులు కేవలం రెండు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంపై అర్హులైన అభ్యర్థుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో పార్కుల సుందరీకరణ : వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో అన్ని పార్కులు సుందరీకరణ చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 42వ డివిజన్ మునిసిపల్ పార్కులో చేపట్టిన పనులకు, 47వ డివిజన్ టీవీ రోడ్డులో చేపట్టిన సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మళ్ల వెంకట్రాజు, కంటిపూడి శ్రీనివాస్, కేవీ శ్రీను, మరుకుర్తి రవియాదవ్, దొడ్ల బాల, వానపల్లి శ్రీను, బేసరీ చిన్ని, మోతా నాగలక్ష్మి పాల్గొన్నారు.

బలభద్రపురంలో భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి

బిక్కవోలు మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రపురంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామిని గురువారం భాష్యకార సిద్ధాంత పీఠాధిపతి పరమహంస పరివ్రాజకాచార్యులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామిజీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు సుబ్బారావు

రాజమమహేంద్రవరం కల్చరల్ మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలుగు కవిత్వంలో స్త్రీకి తగిన గౌరవం ఇచ్చి కథానాయికలను సాధారణ యువతులుగా చిత్రీకరించిన అచ్చమైన స్త్రీవాది రాయప్రోలు సుబ్బరావని ప్రసిద్ధ కవయిత్రి కండెపు సునీత అన్నారు. ఆంధ్ర మహిళా సభ, సంహిత డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు కవుల రచనలలో స్త్రీ పాత్రపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ తెలుగు సీమ సొగసును, తెలుగు వారి ఆచారాలు, భాష, భావ గంభీరాలతో పాటు ఆంధ్ర ప్రాభవాన్ని మనోహరమైన పదాలతో కూర్చు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి.. సుబ్బారావు రచనలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, పి.జయరాజ్, హర్షిత, అన్యూ పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన స్కౌట్ గైడ్ విద్యార్థులు

కడియం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కడియంలో జరుగుతున్న జిల్లా పీఎంశ్రీ పాఠశాలల స్కౌట్ గైడ్ పెట్రో లీడర్స్ నాలుగో రోజు శిక్షణను గురువారం సర్వశిక్ష ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాస్‌లు సందర్శించారు. శిక్షణలో భాగంగా ఏఎల్‌టీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో పల్ల వెంకన్న నర్సరీని సందర్శించి మొక్కలను తిలకించారు. కొన్ని రకాల మొక్కల వివరాలను విద్యార్థులు నోట్‌బుక్స్‌లో రాసుకున్నారు. క్యాంపు ఇన్‌చార్జి గొల్లపల్లి సత్యనారాయణ, స్కౌట్ జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పెన్నులు

గోకవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ మంచి ఫలితాలు సాధించాలని గ్లోబల్ ఆలు మిని వెల్ఫేర్ ట్రస్ట్ స్కూల్ మేట్స్ సభ్యులు అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల్లోని పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు తదితర వస్తువులను ట్రస్ట్ సభ్యులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శుక్రవారం 14 మార్చి 2025 | 1





జనసేనకు.. పండుగ



నేడే జనసేన ఆవిర్భావ దినోత్సవం

(కాకినాడ/ పిఠాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ జరిగే చిత్రాడ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతోన్న తొలి ఆవిర్భావ సభకు పిఠాపురం మండలం వేదికగా మారడంతో అంతా పండగ వాతావరణం తలపిస్తోంది. శుక్రవారం జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ భారీ ఏర్పాట్లతో సిద్ధమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది తరలి రానున్న సభను జయప్రదం చేయడానికి జనసేన పార్టీ ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ 'జయకేతనం' సభ దద్దరిల్లేలా ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో సన్నాహాలు చేసింది.

అదిరే..ఆతిథ్యం

ఆవిర్భావ సభకు వచ్చే జనసేన నాయకులు, అభిమానులు భోజనాలు, తాగునీరు, స్నాక్స్ కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో విస్తృత ఏర్పాట్లుచేశారు. శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా భోజన సదుపాయాలతోపాటు సభా ప్రాంగణంలో నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, పుచ్చకాయలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ధర్మవరం కోల్డ్‌స్టోరేజీ, యానాం రోడ్డు, అన్నవరం వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ భోజన కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. 20కిపైగా అంబులెన్స్‌లు, ఐదు వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. గురువారం మధ్యాహ్నానికే చిత్రాడకు వందలాదిమంది తరలివచ్చారు. వీరందరికి ఇక్కడే భోజన సదుపాయం కల్పించారు.


రహదారుల్లో జనసేన సందడి..

డ్రోన్లు..సీసీ కెమెరాలు..

సభను నేరుగా చూసే అవకాశం లేని వారి కోసం సభా ప్రాంగణంలో 20కిపైగా ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం బయట జాతీయ రహదారిపై ఉండిపోయే వారి కోసం కూడా ప్రత్యేకంగా స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసేందుకు సీసీ కెమెరాలతోపాటు డ్రోన్లతో పోలీసు శాఖ నిఘా ఉంచబోతోంది. సభా ప్రాంగణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 10 నుంచి 15 డ్రోన్లతో సభా ప్రాంగణం, జాతీయ రహదారి, సభకు వచ్చే అన్ని మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. వాటిని నిరంతరాయం గమనించేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. బందోబస్తుకు 1700 మందికి పైగా పోలీసులను ఏలూరు రేంజ్ పరిధిలోని ఆయా స్టేషన్ల నుంచి రప్పించారు. వీరు గురువారం సాయంత్రానికే చిత్రాడ చేరుకున్నారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాహన పార్కింగ్ ఇలా..

వాహనాల పార్కింగ్‌కు తొమ్మిది ప్రాంతాలు ఏర్పాటుచేశారు. కాకినాడ వైపు ఐదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు గుర్తించారు. 216వ జాతీయరహదారిపై కాకినాడ-కత్తిపూడి మధ్య ఆవిర్భావ సభకు వచ్చే వాహనాలు తప్ప మిగిలిన వాటి రాకపోకలను ప్రత్యామ్నాయ రహదారులపై మళ్లించారు. ఆర్టీసీ బస్సులు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో తిరిగేవిధంగా ఆయా మార్గాలను సూచించారు.

- ఒక రోజు ముందే పండగ
- చిత్రాడలో సభకు భారీ ఏర్పాట్లు
- లక్షల మంది వస్తారని అంచనా
- ఎకరం విస్తీర్ణంలో సభావేదిక
- 7 గ్యాలరీలు.. 3 మార్గాలు
- తొమ్మిది పార్కింగ్ ప్రదేశాలు
- భారీ ఎల్ఈడీ స్ర్కీన్లు
- 'థాంక్యూ పిఠాపురం' నినాదం
- మధ్యాహ్నం 3 నుంచి సభ
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు
- 1700 మంది బందోబస్తు

2 గంటలపాటు పవన్ ప్రసంగం

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగా అమరావతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు చిత్రాడ సభా ప్రాంగణం సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగనున్నారు. సభా వేదికకు 500 మీటర్ల దూరంలోనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. పవన్ దాదాపు రెండు గంటలకుపైగా ప్రసంగించే అవకాశం ఉంది. ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఇచ్చిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపేందుకు థాంక్యూ పిఠాపురం చెప్పుకుందాం! అనే నినాదంతో ఈ సభ జరగనున్నది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి పది వరకు జరుగుతాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, ఆడియో, వీడియో ప్రజెంటేషన్లు, ముఖ్య నేతల ప్రసంగాలు, చివరగా పవన్ ప్రసంగం ఉంటాయి.

24 ఎకరాల విస్తీర్ణంలో సభ



చిత్రాడ శివారు 24 ఎకరాల విస్తీర్ణంలో జనసేన ఆవిర్భావ సభ జయకేతనం నిర్వహిస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఏడు గ్యాలరీలు ఏర్పాటుచేసి రెండు మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. అంతకంటే అధికంగా వచ్చేవారు నిల్చుని సభా కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా సభా వేదికను నిర్మించారు. మూడు అంచెల్లో నిర్మించిన సభావేదిక మొదటి వరుసలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఎం పీలు, ఎమ్మెల్యేలు ఆసీనులు కానున్నారు. మి గిలిన రెండు వరుసల్లో సుమారు 250 మంది ఆహ్వానితులు కూర్చునే విధంగా ఏర్పాట్లుచేశారు. సభావేదిక వెనుక భారీ ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. సభ చివర స్థానంలో కూర్చున్న వారికి కూడా పసంగాలు వినిపించేలా. ఏర్పాట్లు చేశారు. అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన లైటింగ్ సిస్టంను వినియోగించారు.

జనసేన జెండాల రెపరెపలు





భారీ ఎల్ఈడీ లైట్లతో ముస్తాబైన సభా వేదిక

హెలిప్యాడ్ పరిశీలన



"ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా నా మనసంతా ఇక్కడే ఉంటుంది.. నేను నోటితో చెప్పను.. పనులు చేసుకుంటూ వెళ్తా.. నా కళ్లు, చెవులు మీరే.. ఏ సమస్యనైనా నా దృష్టికి తీసుకు రండి.. పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రత్యేకంగా అధికారులను పంపి ఇక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటున్నా" పిఠాపురం నుంచి ఎన్నికైన తరువాత డిప్యూటీ సీఎం పవన్ చెప్పిన మాటలు ఇవి. ఆచరణలో వీటిని సాధించి చూపిస్తున్నారు.

- అభివృద్ధి దిశగా పిఠాపురం
- హామీల అమలులో ముందు
- మోడల్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్ కృషి

నడిపించే.. నాయకుడొచ్చాడు!

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు పిఠాపురం.. నేడు పిఠాపురం వేరు.. పవన్ అన్నొచ్చాడు.. పనులు చేస్తున్నాడు.. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. కోట్లాది రూపాయలతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. 9 నెలల్లోనే ప్రతి అంశంలోనూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనదైన ముద్రను బలంగా వేశారు.దేశంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అందరిచూపూ ఇటువైపు ఉండేలా చూస్తానన్న పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటుచేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. విజన్-2029 ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను ఇప్పటికే శాఖల వారీగా తయారుచేశారు. నాలుగేళ్లపాటు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయిస్తారు. పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.38 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యులకు అదనంగా 23 మంది స్పెషలిస్టు వైద్యులు సహా 69 మంది అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించనున్నారు.

9 నెలలు.. అభివృద్ధి ఇలా..

- సుద్దగడ్డ కాలువపై రూ.4 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రూ.1.35 కోట్లతో పశువుల సంత ఆధునికీకరణ.
- ఉపాధి హామీ ద్వారా నియోజకవర్గంలో రోడ్ల పనులు చేస్తున్నారు. రూ.6 కోట్లతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. గొల్లప్రోలు, వన్నెపూడిల్లో ఎస్సీ శ్మశాన వాటికల మార్గాలకు ప్రత్యేకంగా భూసేకరణకు నిధులు కేటాయించారు.
- పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధునీకరణకు రూ. 1.75 కోట్లు మంజూరు చేయించారు. 32 ఉన్నత పాఠశాలలకు రూ.16 లక్షలతో 64 క్రీడాకిట్లు అందజేశారు. 33 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.3 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు.
- పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతన రూ.కోటితో నగర వనం ఏర్పాటుకు శ్రీకారం
- పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ.73 లక్షలు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాడవీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరుచేసి పనులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం.
- గొల్లప్రోలులో రూ.44 లక్షలతో తహశీల్దార్ కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభించాల్సి ఉంది.
- పట్టు రైతులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించి.. పరిహారం మంజూరు చేయించారు. గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి రూ.26 లక్షలు కేటాయించారు.
- గొల్లప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.78 లక్షలతో పనులు నిర్వహించారు. ఇవేగాక పలు పనులకు నిధులివ్వడంతో పనులు జరుగుతున్నాయి.


సుద్దగడ్డ వాగుపై వంతెన వస్తోంది..


పల్లెలు.. పట్టణాలకు రోడ్లు పడ్డాయ్..


100 పడకల ఆసుపత్రి వచ్చేసింది..

17 నుంచి పది పరీక్షలు

ఏర్పాట్లపై కలెక్టర్ ప్రశాంతి సమీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో ఆమె గురువారం సమీక్షించారు. ఈ నెల 17 నుంచి ఆరంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 25,723 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 134 కేంద్రాల్లో పరీక్షలు రాస్తారని చెప్పారు. 1100 మంది ఇన్విజిలేటర్లు, 10 స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్తు సరఫరా, అత్యవసర మందులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 22 పోలీస్ స్టేషన్లలో ప్రశ్న, జవాబు పత్రాలను భద్రపరచామని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాకు సెట్-1, సెట్-2 ప్రశ్న పత్రాలు చేరుకున్నాయన్నారు. కడియపులంక,పోతవరం, రాజుపాలెం, ధవళేశ్వరం జడ్పీ, కొవ్వూరు ప్రభుత్వ, భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్స్‌ని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి అదనపు భద్రత ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల పునర్వవస్థీకరణలో భాగంగా 570 పాఠశాలలు గుర్తించామన్నారు. వీటిలో 504 అంగీకరించగా, అభ్యంతరాలపై నివేదిక అందజేయాలని ఇంకా అంగీకరించని 66 పాఠశాలలను ఆదేశించామన్నారు. బడి బయట 22వేల మంది పిల్లలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయని..వారిలో 19 వేల మంది విద్యార్థుల వివరాలను సేకరించామన్నారు. వేరొక స్కూల్‌లో చేరడం, బదిలీపై వెళ్లడం తదితర కారణాల వల్ల డ్రాపవుట్‌లో నమోదు కావడం జరిగినట్టు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.


అక్రమ ఇసుకను సీజ్ చేసిన ఏడీ ఫణిభూషణ్ రెడ్డి తదితరులు

1100 టన్నుల అక్రమ ఇసుక సీజ్

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.. దోపిడీ సాగిపోతూనే ఉంది. కాతేరు ర్యాంపులలో అక్రమంగా నిల్వ ఉంచిన 1100 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్టు మైన్స్ ఏడీ డీ. ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు.సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ర్యాంపుల్లో తనిఖీ చేయగా సుబ్బారావు సొసైటీ,రమేష్ బోట్స్‌మన్ సొసైటీల ఆధ్వర్యంలో నిల్వ చేసిన ఇసుక సీజ్ చేశామన్నారు.అక్కడ రెండు యంత్రాలు ఉన్నట్టు గుర్తించామన్నారు.ఇసుకఅక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

మహిళలు,బాలికల రక్షణకు శక్తి యాప్

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల రక్షణలో 'శక్తి' యాప్ ఎంతో శక్తివంతమైనదని.. వారి సెల్‌ఫోన్‌లో తప్పనిసరిగా ఆ యాప్ ఉండాలని ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. యాప్ డౌన్‌లోడ్, ఇన్‌స్టలేషన్, ఫీచర్లపై సాంకేతిక బృందంతో గురువారం ఎస్పీ సమీక్షించారు.గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా ఆపద సమయంలో తక్షణ పోలీసు సహాయం అందుతుందని చెప్పారు. ఇప్పటికే చాలా మంది డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఆపదలో ఉన్న సమయంలో ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే తక్షణమే వారు ఉన్న ప్రదేశం వివరాలు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి, డయల్ 112 కాల్ సెంటర్‌కి చేరడం పోలీసులు వెంటనే అక్కడి చేరుకొని వారిని రక్షించడం జరుగుతుందన్నారు. మండలాల వారీగా పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళలు, బాలికల రక్షణకు నైట్ షెల్టర్లు, వన్‌స్టాప్, కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలోనే శక్తి టీమ్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) మురళీ కృష్ణ, డీఎస్పీ భవ్య కిశోర్ పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



కీడు బట్టలు ధరించడానికి వెళుతూ
బామ్మ..మనవడు మృతి

ప్రమాదం ఏ వైపు నుంచి ఎలా వస్తుందో ఊహించడం కష్టమే.. దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద గురువారం జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ.. మామ మనవడు కీడు బట్టలు ధరించడానికి బైక్‌పై బయలుదేరారు.. అయితే దుద్దుకూరు వద్ద లారీ వెనుక వేగంగా వెళుతుండగా లారీకి సడన్ బ్రేక్ వేశాడు.. వెనుక వస్తున్న బైక్ లారీని ఢీకొట్టడంతో మామా మనవడు మృతిచెందారు. - 4లో

శూలాలు గుచ్చుకుని.. పండుగ!

అంతా ఉత్తిదే అనుకుంటే పొరబడినట్టే..అక్కడ నోటిలో ఒక వైపు నుంచి మరొక వైపునకు వచ్చేలా శూలాలతో గుచ్చుకుంటారు..వాటికి అటూ ఇటూ నిమ్మకాయలు పెడతారు.. నడుం మీద కొక్కెంలతో గుచ్చుకుని రథాన్ని లాగుతారు.. ఆ ఒక్క రోజు అత్యంత నిష్ఠగా ఉంటారు.. ఇదెక్కడో మారుమూల అనుకునేరు.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ప్రతి ఏడాది మార్చి 13న ఒక కాలనీలో భక్తులు చేసే శూలాల పండుగ ఇది.. గురువారం జరిగింది. చాలా ఏళ్ల కిందట తమిళనాడు వాసులు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు.. బర్మాకాలనీ అని ఒక పేరుపెట్టుకున్నారు.. ఆ కాలనీలో అంతా వారే. ప్రతి ఏడాది మార్చి 13న శూలాల పండుగ చేస్తారు. గురువారం ఇలా శూలాలు గుచ్చుకుని.. నడుంకి కొక్కెంలు పెట్టుకుని పుష్కరఘాట్ నుంచి బర్మాకాలనీ వరకూ రథాన్ని సుమారు 5 కిలో మీటర్లు లాగుతూ ర్యాలీ చేశారు. వారి వెనుక మహిళలు పాల బిందెలతో నడిచారు. - రాజమహేంద్రవరం సిటీ



ఎన్టీఆర్ నగర్ ఇళ్ల నిర్మాణంలో కదలిక

27,441 మంది గుర్తింపు

రేపటి నుంచి అవగాహన

రాజమహేంద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చడానికి కూటమి నిర్ణయించింది. పేదల ఇళ్లు నిర్మించుకునే కాలనీలకు ఎన్టీఆర్ కాలనీలు అని పేరుకూడా ఖరారు చేసినసంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 27,441 మంది లబ్ధిదారులను గుర్తించామని వారికి పీఎం ఏవై గ్రామీణ, అర్బన్ 1.0 పథకం కిందే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నిధులు ఇవ్వను న్నట్టు చెప్పారు. ఎస్సీ బీసీలకు రూ.50 వేల వంతున, ఎస్టీలకు రూ.75వేలు, పీజీటీ గ్రూపు లకు రూ.లక్ష వంతున ఆర్థిక సహాయం చేస్తున్నట్టు చెప్పారు. నాలుగు దశల్లో లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు పడతాయన్నారు.ఈ మేరకు లబ్ధిదారులకు శనివారం నుంచి అవగాహన కల్పించాలని చెప్పారు. మే నెల 31వ తేదీలోపు జిల్లాలో 7 వేల ఇళ్ల నిర్మా ణం చేయాలని తెలిపారు. డిసెంబర్ లోపు మొత్తం పూర్తి చేయాలన్నారు. వెలుగుబంద ఎన్టీఆర్ నగర్‌లో 1240 ఇళ్లను మే 31లోపు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, డ్వామా పీడీఎ.నాగమల్లేశ్వర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బీవీ. గిరి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

4 వైభవంగా రంగనాథ కల్యాణం

వైభవంగా శ్రీ రంగనాథ స్వామి కల్యాణం


శ్రీభూ సమేత రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు శ్రీరంగనాథ స్వామివారి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత రంగనాధ స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అను వంశక అర్చక స్వాములుపెదపాటి గిరిధరా చార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు మంత్రోచ్ఛరణల మధ్య వంశ పరంపార్యకల్యాణ దాత గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులు ఎస్‌టీపీ వెంకట రమణాచార్యస్వామి దంపతులు స్వామివారి కల్యాణ క్రతువును పీటలపై కూర్చుని నిర్వహించారు. పాలకొల్లు నుంచి ప్రత్యేకంగా వచ్చిన భక్తబృందం, వెంకటరమణాచార్యస్వామి వారి శిష్యబృందం, ఈరంగనాధస్వామి కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన వందలాదిమంది భక్తులకు బాదంపాలు, ప్రసాదాలుఅందజేశారు.

గజవాహనంపై స్వామి గ్రామోత్సవం

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు గజవాహనంపై ఆశీనులై గ్రామోత్సవం చేశారు. స్వామి వారి దిగువ దేవస్థానంవద్ద స్వామి వారికి సేవాకాలం నిర్వహించి స్వామి వారిని ఆలయ అర్చకస్వాములు గజవాహనంపై ఆశీనులు గావించారు. ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్‌స్వామి, లక్ష్మీనరసింహభట్టర్ స్వామి, రఘునాధభట్టర్ స్వాముల స్వీయ పర్యవేక్షణలో ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి గజవాహనం స్వామి వారి వాహనం ఆలయం నుంచి బయల్దేరింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ఫల పుష్పాలు, మంగళ నీరాజనాలు అందజేసి ఆశీస్సులు అందుకున్నారు.

అలరించిన పండిత సభలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీరంగనాధస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 93వ విశిష్టాద్వైత పండిత సభల్లో రామనుజ ముని జీయర్ స్వామి, ఉభయ వేదాంత పండితులు గుదిమెళ్ళ మురళీకృష్ణామాచార్య స్వామి(భద్రాచలం స్థానాచార్యులు), పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, రఘునాధ భట్టర్ స్వామి, స్థలసాయి స్వామి, తదితర ఉభయ వేదాంత పండితులు పండిత పామర జనరంజకంగా ఉపన్యసించారు. శ్రీ వైష్ణవ సాంప్రదాయంల గురించి శృతి,స్మృతి, ఇతిహాస, పురాణ, భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఆళ్వారుల దివ్య ప్రబంధంలోని విషయాలను, భారత భాగవత రామాయణంలోని విషయాలను సమన్వయం పరుస్తూ ప్రస్తుత మానవ జీవితానికి అన్వయిస్తూ పండితులకే కాకుండా పామరులు సైతం అర్థమయ్యే విధంగా ఉపన్యసించారు. కోరుకొండ, పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు ఈ పండిత సభల్లో పాల్గొన్నారు. అలాగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు తిలకించడానికి విచ్చేసిన భక్తులందరికీ స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో ఉదయం, సాయంత్రం అన్నప్రసాదాలు అందజేస్తున్నట్లు సత్రం ఈవో గండి వెంకటలక్ష్మీకుమార్, వి. సూరిబాబు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవు

● కాకినాడ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి


రికార్డులు పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి

దేవరపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా బెల్టుషాపులు, నాటుసారా విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని కాకినాడ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళీ అన్నారు. దేవరపల్లిలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని గురువారం ఆయన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో 294 కేసులు నమోదు చేయగా వాటిలో 100 కేసులు బెల్టు షాపులపైనే నమోదు చేశామన్నారు. ఎక్సైజ్‌శాఖ పరిధిలో 20 సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయని, 455 మద్యంషాపులు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవోదయ కార్యక్రమం ఏర్పాటుచేసి ప్రజల్లో అవగాహన, కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఎక్కడైన అక్రమంగా నాటుసారా తయారుచేసినా, గంజాయి విక్రయించినా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గ్రామాభివృద్ధి జరగాలి

సర్పంచ్, ఎంపీటీసీలకు ఒక్కరోజు శిక్షణా తరగతులు


కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో, గోపాలపురంలో అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామ, మండల అభివృద్ధికి ప్రణాళికలు తయారీపై మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, ఎంపీడీవో కె.సుశీల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణా కార్యక్రమంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాల నిర్వహణ, గ్రామాభివృద్ధి వంటి అంశాలపై ఏపీఎం రత్నకుమారి, దొమ్మేరు ఎంపీహెచ్‌ఈవో ఎస్.శ్రీనివాసరావు, ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ పద్మిని, ఇంచార్జి ఈవో పీఆర్‌ఆర్‌డీ బి.వి.ఎస్.ఎన్.కె.ఎస్.ఎస్. ప్రకాశరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి.సతీష్‌లు అభివృద్ధి ప్రణాళికలు తయారీపై శిక్షణను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ కె. ప్రసన్నకుమార్, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి సర్పంచ్‌లు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, మేకల శ్రీను, తానేటి కుమారి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. రిసోర్స్ పర్సన్స్ అభివృద్ధి ప్రణాళికలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ కె.అంజనేయశర్మ, డీటీ కనకదుర్గ, ఎంఈవో శారదాజ్యోత్స్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజల అసరాలను తీరుస్తూ అభివృద్ధికోసం ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే అంశాలపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, సచివాలయ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన ఎంపీడీవో వెంకటరమణ నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో ప్రజల అవసరాలను తీరుస్తూ గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ముఖ్యంగా మహిళల సాధికారత, మండలంలోని ఉన్నత స్థాయి పాఠశాలల విద్యార్థిణులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి గ్రామాల అభివృద్ధి వంటి 9రకాల అంశాలపై కార్యదర్శులు చేపట్టాల్సిన కార్యాచరణపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వీరన్న, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్య దర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నా రు.

చాగల్లు: భవిష్యత్ అవసరాలను ముందుగా గుర్తించి తగిన ప్రణాళికలు రూపొందించుకోవడం ద్వారా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి సాధించవచ్చునని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన 2025-26కి గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పేదరిక నిర్మూలన, గ్రామాల అభివృద్ధి, కనీస అవసరాలు మెరుగుపరచడం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ శ్రవణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గోపాలపురం: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళతాయని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రణాళికలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజ్యాంగ నిర్మాత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించా రు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీ టీసీ కాకులపాటి లలిత,పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

దేవరపల్లి:గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు కోరారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీటీసీలకు గ్రామ స్వరాజ్ అభయాన్ శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధులు క్షుణ్ణంగా తమ అధికారాల గురించి తెలుసుకుంటే అధికారులతో తమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని అన్నారు. ఈవోపీఆర్‌డీ రాజారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పరిశుభ్రతపై వివిధ అంశాలపై ఎంపీటీసీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంటెండ్ శాంతి, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీల సంఘ వార్షికోత్సవం

ఉండ్రాజవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవం గురువారం పాలంగిలోని మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులకు పండ్లు, స్వీట్స్ డ్రింక్స్ పంపిణీ చేశారు. తూర్పుగోదావరిజిల్లా పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్ మల్లేశ్వరరావు, మండల సంఘ సభ్యులు పి.ప్రసాద్, ఏవీ వెంకటేశ్వరరావు, పి. అనంతలక్ష్మి, ఎం.అనూష్, ఆర్.అన్నపూర్ణ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

» ఒకే కుటుంబంలోని మామ్మ, మనవడు దుర్మరణం
» తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఘటన
» గోపాలపురం గ్రామంలో విషాదఛాయలు


మీరాతున్నీస, సమీర్(పాతచిత్రాలు).. దేవరపల్లి మండలం దుద్దుకూరు సమీపంలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) భర్తకు గుండె ఆపరేషన్ చేయించి నెల కాకుండానే భార్య, మనవడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన మామ్మ షేక్ మీరాతున్నీస (50), మనవడు షేక్ సమీర్(17) కీడుబట్టలు కట్టుకోవడానికి గురువారం కొవ్వూరు మండలం పంగిడి సమీపంలోని గోవర్ధనమెట్ట వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి బయల్దేరారు. 1.30గంటల సమయంలో దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఎదురుగా వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక మోటారు సైకిల్‌పై వస్తున్న వీరు లారీని ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మీరాతున్నీస చికిత్స పొందుతూ మృతిచెందింది. సమీర్‌ను మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మీరా తున్నీస కుమారుడు షేక్ రియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు సమీర్(17) స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయసంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. తండ్రి రియాజ్ వడ్రంగి పనిచేస్తుంటాడు. ఆయనకు చేదోడుగా ఉంటూ ఖాళీ సమయాలు, సెలవు రోజుల్లో తండ్రితో కలిసి వెళ్తూ పనిలో సాయం చేస్తుంటాడు. గురువారం పరీక్ష లేకపోవడంతో నానమ్మను ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. సమీర్ స్నేహితులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

పాఠశాలలు, రేషన్‌షాపులలో స్టాక్ రికార్డుల పరిశీలన

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణ, మండలంలో గురువారం ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ పర్యటించారు. గురువారం పట్టణంలోని పాఠశాలలు, రేషన్‌షాపులను సందర్శించారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగ్గా నిర్వహించని సీడీపీవో, సూపర్‌వైజర్లకు మెమోలు అందించాలని ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిన మెనూ ప్రకారం ఆహారం పెట్టాలన్నారు. విద్యార్థు లతో కలిసి భోజనంచేసి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి కె.విజయకుమారి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి. రాధిక, గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.ఎన్.జ్యోతి, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, బీసీ వసతి గృహాల అధికారులు, తూనికలు కొలతలు, జిల్లా ఆహారభద్రత అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువుల నిషేధం

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మున్సిపాల్టీ పరిధిలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. గురువారం కొవ్వూరు పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారస్తులకు ప్లాస్టిక్ నిషేధ సర్కులర్‌లను అందించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ప్లాస్టిక్ వేస్టు మేనేజ్‌మెంటు రూల్స్ 2016 ప్రకారం పట్టణంలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, థర్మకోల్స్, ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు, ప్లాస్టిక్ జెండాలు అమ్మకాలను నిషేధించామన్నారు. గురువారం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పట్టణంలోని అన్ని ప్లాస్టిక్ హోల్‌సేల్, రిటైల్‌షాపులలో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. నిషేధించిన ప్లాస్టిక్, ఇరత వస్తువులు అమ్మినా, లేదా వినియోగించిన వారిపై రూ.5000 జరిమానా, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, మార్చి13(ఆంధ్రజ్యోతి): నేడు (శుక్రవారం) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 10 వరకు 33/11 కేవీ కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ నడిపల్లి ఇండస్ట్రీయల్ ఫీడర్‌నందు మొక్కలు కటింగ్ చేసే నిమిత్తం ఆయా గ్రామాల్లో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. నడిపల్లి, కానూరు, మునిపలి గ్రామాల్లో వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగుతుందన్నారు. 11 కేవీ నడిపల్లి అగ్రికల్చర్ ఫీడర్‌లో ట్రీకటింగ్ నిమిత్తం నడిపల్లి, కానూరు రైతులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఎయిడెడ్ పాఠశాలలను నిర్లక్ష్యం చేసిన జగన్

●టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్


టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జవహర్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

కొవ్వూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎయిడెడ్ పాఠశాలలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ అన్నారు. గురువారం కొవ్వూరులో జవహర్‌ను పల్నాడు జిల్లాకు చెందిన చర్చి పాస్టర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలోనే క్రైస్తవులకు మేలు జరిగిందన్నారు. రాబోయో రోజులలో మిషనరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి విద్యకు చేయూతనివ్వాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో క్రైస్తవ భవనం ఏర్పాటు చేయాలని, బీసీ వర్గాలకు వసతిగృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జవహర్ స్పందిస్తు ఎయిడెడ్ పాఠశాలల పునరుద్ధరణకు, సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చంద్రబాబు అధికారం చేపట్టిన తరువాత విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మేకల దాస్, డేగల దేవానంద్, తోమస్, మైకెల్, మాచర్ల నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి రాంబాబు, మోషే, దానయ్య పాల్గొన్నారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలకు అదనపు నిధులు మంజూరు

తాళ్లపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన స్థలాల్లో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తోందని గురువారం తాళ్లపూడి గృహ నిర్మాణశాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఏఈ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరుచేసిన స్థలాల్లో ఇళ్లను కట్టుకోలేక అసంపూర్తిగా మిగిలిపోయిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని వినియోగంలోకి తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధుల నుంచి బీసీ, ఎస్సీలు ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.50 వేలు చొప్పున, ఎస్టీలకు 75వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మండలంలో నిర్మాణాలు పూర్తిచేయలేక బీసీ, ఎస్సీ, ఎస్టీలు 192 మంది లబ్ధిదారులు ఉన్నారని వీరిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వమే అదనపు నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ అవుగడ్డ మల్లిఖార్జునరావు(40) ఫిబ్రవరి 28వ తేదీ న డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి ఉండడంతో కుటుంబ సభ్యులు వెతికారు. కనిపించకపోవడంతో మార్చి 8వ తేదీన భార్య అవుగడ్డ దుర్గ కొవ్వూరురూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మల్లిఖార్జునరావు అదృశ్యం అయినట్లు ఎస్ఐ కె. శ్రీహరిరావు కేసు నమోదు చేశారు. ఈనెల 12వ తేదీ రాత్రి పెరవలి లాకుల వద్ద గుర్తుపట్టలేని విధంగా ఉన్న గుర్తుతెలియ ని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం తో మృతదేహాన్ని మల్లిఖార్జునరావుదిగా గుర్తించినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు


నల్లజర్ల పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ షరీఫ్‌ను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ తెల్లం గంగాధర్, మహ్మద్ సిరాజ్‌జుద్దీన్ ఆధ్వర్యంలో గురువా రం ల్యాబ్ టెక్నీషియన్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ప్రధానపాత్ర రోగనిర్ధారణ విభాగానిదేనన్నారు. అన్ని పీహెచ్‌ల్లో 2వ ల్యాబ్ టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిమాతకు నీరాజనం


గోదావరిమాతకు హారతి ఇస్తున్న పండితులు

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అఖండ గోదావరి మాతకు మహా నీరాజనం అందించారు. కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు అధ్యక్షతన గురువారం 234వ మాసోత్సవ దీపోత్సవం నిర్వహించారు. క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో ఉన్న గోదావరిమాత ఆలయంలో అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం గోదావరిమాతకు వివిధ రకాల హారతులు అందించి మహానీరాజనం సమర్పించారు. అనంతరం నేతి దీపాలను వెలిగించి గోదావరిలో వదిలిపెట్టి దీపోత్సవం నిర్వహించారు.

జనసేన సభ విజయవంతం కావాలని పూజలు


దేవరపల్లి కడియాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న జనసైనికులు

దేవరపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావసభ విజయవంతం కావాలని కోరుతూ దేవరపల్లి కడియాలమ్మ ఆలయంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు ఆధ్వర్యంలో జనసైనికులు పూజలు నిర్వహించారు. గోపాలపురం, చింతలపూడి, నియోజక వర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం 9గంటలకు చేరుకుని ఇక్కడి నుంచి భారీ ర్యాలీగా తరలివెళతామని సువర్ణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాదవరపు వెంకటేశ్వరరావు, దాసరి శేషారావు, పసుపు లేటి శివనాగప్రసాద్, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, సిద్ధా తాతాబ్బాయి, కవల సీతారత సూర్యకుమారి, అడబాల మణికంఠ పాల్గొన్నారు.

మనమిత్ర వాట్సాప్ సేవలపై అవగాహన


మనమిత్ర వాట్సాప్ సేవలపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే చేరవేస్తున్నట్లు కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ అన్నారు. కొవ్వూరు పట్టణంలోని ఎన్.జి.వో హోమ్, ఇందిరమ్మకాలనీ, ఆవులవారివీధి వార్డు సచివాలయాలలో గురువారం సచివాలయ కార్యదర్శులు, ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు, ప్రజలకు మనమిత్ర వాట్సాప్ సేవలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మనమిత్ర వాట్సాప్ ద్వారా రెవెన్యూ, మున్సిపల్, విద్య, ఆర్టీసీ, టీటీడీ, విద్యుత్ వంటి సుమారు 200 సేవలను అందజేస్తామ న్నారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, మున్సిపల్ మేనేజర్ పి. సాయిబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి


కొవ్వూరు యానాదికాలనీ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర

కొవ్వూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు యానాదికాలనీ ప్రజల సౌకర్యార్థం ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం కొవ్వూరు పట్టణంలోని యానాదికాలనీలో బీజేపీ నాయకులు పర్యటించి ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరీ ఆదేశాల మేరకు యానాదికాలనీలో పర్యటించి ప్రజలనుంచి సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ముత్యాలరావు, గంధ్రోతు పవన్, పోణంగి పవన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాగల్లు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్ర స్తుత ఆర్థిక సంవత్సరంలో బీసీల ఈబీసీల స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మశీ చదువు కున్న నిరుద్యోగ యువత కోసం స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈబీసీ సామాజిక వర్గాలవారు అనగా ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, తదిత సామాజిక వర్గాలకు చెందిన వారు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో ఆర్థిక సహాయం మంజూరు చేసేందుకు, కాపు సామాజిక వర్గం వారికి అనగా కాపు, తెలగ, బలిజ, వంటరి వర్గాల వారికి బ్యాంకు రుణం, సబ్సిడీతో ఆర్థిక సహాయం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దారి ద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు ఆన్‌లైన్‌లో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకో వచ్చునని తెలిపారు. అర్హత కలిగిన వారు నేరుగా తెల్లరేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రంలతో మీసేవ, గ్రామ సచి వాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవం

దేవరపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): యర్నగూడెంలో అలివేలుమంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంవద్ద ప్రత్యేక హోమాలు, పూజలు, నిర్వహించారు. ఉదయం అబిషేకాలు, లక్ష్మీగణపతి హోమం వేదపండి తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పీటలమీద నూలు వెంకటశ్రీనివాస్ దంపతులు, కంచెర్ల శ్రీనివాస్, దంపతులు కూర్చున్నారు. ఆలయ ధర్మకర్త శ్రీకాకుళపు కాశీవిశ్వనాధం, రోహిణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


యర్నగూడెంలో అలివేలుమంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం